


వికాస్ కళ్లల్లో వెలుగులు నింపరూ.. 2



నిధుల మంజూరుపై హర్షం.. 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## 'సర్' ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల ద్వారా ఇప్పటివరకు ఎంతవరకు సర్వే చేశారనే వివరాలను తెలుసుకున్నారు. మండలంలోని కమ్మర్‌పల్లి, ఉప్లూర్, చౌట్‌పల్లి గ్రామాల్లో ప్రక్రియన మందకొడిగా సాగుతుండడంపై అధికారులను అలర్ట్ చేశారు. వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.



## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** రూరల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అశోక్ ఫారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఆకుల కొండూర్‌లోని గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో మహిళా సంఘ భవనం నిర్మాణం, రూ.5లక్షలతో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఫంక్షన్ హాల్, కొండూర్ గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళా సంఘాలకు శాశ్వత వసతులు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తుండగా, రాష్ట్రంలోనే అత్యధికంగా 132 మహిళా సంఘ భవనాలు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో నిర్మిస్తుండటం గర్వకారణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నట్లు తెలిపారు.



## కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే ఊరుకోం..

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పదేపదే కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే ఊరుకోమని ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ అన్నారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌పై బీజేపీ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహేష్ కుమార్ గౌడ్ 30 ఏళ్లుగా ప్రజల మధ్య ఉంటూ సేవ చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో గెలపోటములు సహజమని, గెలిచినవారు ప్రజల అభివృద్ధికి పని చేయాలన్నారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆర్మూర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు శాల ప్రసాద్ మాట్లాడుతూ.. పైడి రాకేష్‌రెడ్డి విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు, నాయకులు ఎస్కే బాబు తదితరులు పాల్గొన్నారు.



# ఆహారం భద్రమేనా..

- పరిశుభ్రత పాటించని పలు హోటళ్లు
- మరిగించిన నూనె తిరిగి వాడకం
- చర్యలు చేపట్టని అధికారులు

**పొద్దున టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి బిర్యానీ.. హడావిడి జీవితంలో హోటల్ మీద ఆధారపడటం ఈ రోజుల్లో సర్వసాధారణం అయిపోయింది. కానీ ఆ కమ్మని రుచి వెనుక మన ఆరోగ్యం ఎంత సురక్షితంగా ఉంది? అనేదే అసలు ప్రశ్న.. కామారెడ్డి జిల్లాలోని పలు హోటళ్లలో కనిపిస్తున్న నిర్లక్ష్యం చూస్తే ఆహారం భద్రమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ హోటళ్లు వెలిశాయి. రోడ్లు, కాలనీలు ఇలా చెప్పుకుంటూ పోతే అడుగడుగునా హోటల్స్ దర్శనమిస్తున్నాయి. అయితే ఏ హోటల్ ఎంత భద్రం అనేది ఇక్కడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రధాన రహదారులు వెంట ఉన్న హోటళ్లు, దాబాలలో దుమ్ము దూళితో క్రిములు చేరే అవకాశం ఉన్నా పెద్దగా పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది.

### అపరిశుభ్రంగా కిచెన్లు

హోటళ్లు ప్రవేశ ద్వారాలు, కస్టమర్లు కూర్చేనే ప్రాంతాలను అందంగా అలంకరిస్తున్న యాజమాన్యాలు కిచెన్‌ను మాత్రం పట్టించుకోవడం లేదు. కిచెన్‌లో జిడ్డు పట్టిన స్లాబులు, బహిరంగంగా పడేసిన చెత్త, శుభ్రంగా లేని గిన్నెలు దర్శనం ఇస్తున్నాయి. కిచెన్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నాయి. వంట చేసే సిబ్బంది చేతికి గ్లౌజులు, తలకు కవర్ పెట్టుకోవడం లేదు. అంతేగాకుండా ఒకసారి వేడిచేసిన నూనెను వడగట్టి, మళ్లీ మళ్లీ అదే నూనెతో బజ్జీలు, పూరీలు, చికెన్ ఫ్రైలు చేసేస్తున్నారు. ఆరోగ్య నిపుణుల మాటల్లో చెప్పాలంటే, పదేపదే వేడిచేసిన నూనె విషంతో సమానం. రోజూ కొత్త నూనె కొనడం ఖర్చుతో కూడుకున్న పని అని నిర్వాహకులు చేతులెత్తేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

### ఈగలు, దోమలతో..

కూరలు, స్వీట్లు, కట్ చేసిన పండ్లను మూతలు లేకుండా బయట పెట్టడం.. వాటిపై ఈగలు వాలడం సాధారణమైపోయింది. పలు హోటళ్లలో కిచెన్ కిటికీలకు జాలీలు లేకపోవడంతో దోమలు, బొద్దింకలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఇలాంటి ఆహారం తినడం వల్ల టైఫాయిడ్, కలరా, ఫుడ్ పాయిజనింగ్, అతిసారం లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంది.

### నోటీసులే.. చర్యల్లేవ్

ఆహార భద్రతా శాఖ అధికారులు అప్పుడప్పుడు సోదాలు నిర్వహించి జరిమానాలు విధించినా, అవి పేపర్ టైగర్లుగానే మిగిలిపోతున్నాయి. సిబ్బంది కొరత, రాజకీయ ఒత్తిళ్లతో తనిఖీలు నామమాత్రంగా సాగుతున్నాయనే విమర్శలున్నాయి.
పట్టుబడిన హోటళ్లకు తాత్కాలిక నోటీసులు ఇవ్వడమే తప్ప, లైసెన్సులు రద్దు చేసిన దాఖలాలు అరుదు.
కొద్దిరోజుల క్రితం జిల్లా కేంద్రంలోని రెండు ప్రధాన హోటళ్లలో అధికారులు దాడులు నిర్వహించారు.
హోటళ్లలో శుభ్రత లేని మాంసం, కూరగాయలు ఉన్నట్టుగా గుర్తించారు. సంబంధిత హోటళ్లకు నోటీసులు కూడా జారీ చేశారు. ఆ తర్వాత చర్యలు తీసుకోవడం పక్కన పెట్టేశారు.

### తనిఖీలు కొనసాగుతున్నాయి



జిల్లాలోని హోటళ్లపై నిరంతరం తనిఖీలు కొనసాగుతున్నాయి. పరిశుభ్రత పాటించని హోటళ్లకు నోటీసులు ఇస్తున్నాం. ఈ నెలలో ఒక హోటల్‌పై కేసు కూడా నమోదు చేశాం. వర్షాకాలం కావడంతో ఖచ్చితంగా ప్రతి హోటల్‌లో పరిశుభ్రత పాటించాలి. కూరగాయలు, మాంసం ఫ్రెష్‌గా ఉంచాలి. నిల్వ ఉంచి వాడితే ప్రజలు అనారోగ్యానికి గురవుతారు. ఆహార భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు.

**– విక్రమ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, కామారెడ్డి**



## కాంగ్రెస్ పాలనలో రైతులకు పెద్దపీట..

**అక్షరటుడే, ఆర్మూర్:** రైతాంగ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేయడం పట్ల ఆదివారం ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. వానాకాలం సీజన్‌కు సంబందించి పెట్టుబడి సాయం సకాలంలో విడుదల చేసిందన్నారు. ఏఎంసీ ఛైర్మన్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



## పోలీసుల చొరవతో భూవివాదానికి పరిష్కారం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎన్నో ఏళ్లుగా నెలకొని ఉన్న భూ వివాదం నాగిరెడ్డిపేట్ పోలీసుల చొరవతో పరిష్కారంఅయింది. బంజారా గ్రామ పరిధిలోని 24 గుంటల భూమి విషయంలో మాన్‌సింగ్, శ్రీను, లింబ్యాల మధ్య ఎన్నో ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. గ్రామ పెద్దలు నిర్వహించిన పంచాయితీలు కూడా సమస్యను పరిష్కరించలేకపోయాయి. మాన్‌సింగ్, శ్రీను పరస్పరం దాడులకు పాల్పడి జైలుకు కూడా వెళ్లివచ్చారు. ఈ భూ వివాదం భవిష్యత్తులో శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశం ఉందని ముందుగానే గుర్తించిన నాగిరెడ్డిపేట్ పోలీసులు చొరవ తీసుకున్నారు. ఇరుపక్షాలతో పలుమార్లు చర్చలు నిర్వహించి, ఓర్పుతో కౌన్సెలింగ్ చేసి, పరస్పర అంగీకారంతో వివాదానికి ముగింపు పలికారు.

## డెయిరీ టెక్నాలజీ కళాశాలను సందర్శించిన కౌన్సిలర్




**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని 14వ వార్డ్ పరిధిలో ఉన్న డెయిరీ టెక్నాలజీ కళాశాలను వార్డు కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత సందర్శించారు. దొడ్ల డెయిరీ హైదరాబాద్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.4 కోట్లతో నిర్మిస్తున్న కళాశాల మొదటి అంతస్తు భవన నిర్మాణం పనులను పరిశీలించారు. డైరీ కళాశాలలో ఇంజినీరింగ్, డైరీ ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక డెయిరీ టెక్నాలజీ కళాశాల కామారెడ్డిలో ఉండటం హర్షించదగ్గ విషయమని హర్షిత పేర్కొన్నారు. డెయిరీ టెక్నాలజీ కారణంగా దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయాన్నారు. డెయిరీ కళాశాల అభివృద్ధికి దోహద పడతామని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పీజీ డెయిరీ కోర్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హర్షితకు కళాశాల అధ్యాపక బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ సురేష్ రాథోడ్, అధ్యాపకులు ఉమాపతి, డాక్టర్ స్వర్ణలత, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మూడు రోజులైనా గుంత పూడ్చరా..?

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట వాటర్ లీకేజీ అవుతుండటంతో మున్సిపల్ సిబ్బంది మూడు రోజుల క్రితం గుంత తీసి మరమ్మతులు చేశారు. అయితే గుంత పూడ్చడం మర్చిపోయారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆ గుంత పెద్దది అవుతోంది. గేటు వద్ద గుంత ఉండటంతో ఆస్పత్రిలోకి వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గుంత తీసిన మట్టిని రహదారిపై వేయడంతో రోడ్డు మరింత ఇరుగ్గా మారింది. అధికారులు స్పందించి తక్షణమే గుంతను పూడ్చాలని ఆస్పత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు.

## వెక్కిరిస్తున్న శిలాఫలకం..రోడ్లపైనే కూరగాయల విక్రయాలు



**పట్టణంలోని గంజ్ మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు కోసం 2021లో నాటి ప్రభుత్వం రూ.7.20 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించి ఆ నాటి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పిల్లర్ల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. పాత డిజైన్ మార్చి కొత్త డిజైన్ తో రూ.11 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. దానిపై ఇప్పటికి ఎలాంటి సమాచారం లేదు. అయితే పనుల ప్రారంభం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం మాత్రం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ వెక్కిరిస్తూనే ఉంది. ఏడాదిలో మార్కెట్ అందుబాటులోకి తెస్తామని గొప్పలు చెప్పిన నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. మరోవైపు రైతులు మాత్రం ఎండకు ఎండుతూ, వర్షా నికి తడుస్తూ రోడ్లపై కూరగాయల విక్రయాలు చేపడుతున్నా.. కనీస వసతులు కల్పించేందుకు ఇటు అధికారులు, అటు నాయకులు ముందుకు రాకపోవడం గమనార్హం.**

**- అక్షరటుడే, కామారెడ్డి**







## కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతు భరోసా 5 ఎకరాలకు నిధులు విడుదల చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రైతు భరోసా వచ్చిన రైతులు బాల్కొండ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి కూడా ధన్యవాదాలు తెలిపారు. రైతుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, మార్కెట్ కమెటి ఛైర్మన్ పాలెపు నర్సయ్య, మాజీ అధ్యక్షుడు సుంకేట రవి, కిసాన్ ఖేత్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, తక్కురి దేవేందర్, హాసకొత్తూరు సర్పంచ్ నలిమేల గంగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కుంట ఆనంద్, బాల్కొండ నియోజకవర్గ యూత్ మాజీ ఉపాధ్యక్షడు మేడిపల్లి రిత్విక్, టౌన్ అధ్యక్షుడు సల్లూరి గణేష్, చౌట్‌పల్లి అధ్యక్షుడు రవీందర్, బషీరాబాద్ అధ్యక్షుడు నర్రా భూమేష్, శైలేందర్, బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, బాలయ్య, రాజేందర్, వన్నెల దేవేందర్, సంజీవ్, నరేష్, జగదీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో అండగా నిలిచిన స్నేహితులు..

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మెట్టు వెంకటేష్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న వెంకటేష్ స్నేహితులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయిన వారు అందరూ కలిసి ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా స్నేహితులు తమ వంతు విరాళాలను వెంటనే సేకరించి కుటుంబ అవసరాల కోసం నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారిని గ్రామస్తులు అభినందిస్తూ, ఆపదలో స్నేహితులే నిజమైన బలమని కొనియాడారు.

**రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కోసం ఆ అంధ బాలుడు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాడు.. తన చూపు కోసం ఆపరేషన్ చేయిస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో.. ఆయనెప్పుడు స్పందించి తనకు చూపు తెప్పిస్తారా అంటూ బాలుడు వేచి చూస్తున్నాడు..**

**- అక్షరటుడే గాంధారి**




# వెలుగులు నింపరూ..?

■ తన గానంతో మెప్పించిన అంధ గాయకుడు వికాస్ ■ కళ్లు వచ్చేవిధంగా చూస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ■ అమలు కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు

కాంగ్రెస్ పాదయాత్ర సందర్భంగా 2023 మార్చిలో గాంధారి మండలంలో నిరుద్యోగ నిరసన దీక్ష జరిగింది. ఈ దీక్షలో అంధ బాలుడు వికాస్ పాడిన పాటకు అప్పటి పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ముగ్ధులయ్యారు. కాంగ్రెస్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ద్వారా సభావేదికపైనే రూ.లక్ష నగదు అందజేశారు. వికాస్‌కు కంటి ఆపరేషన్ చేయిస్తానని, ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని నాడు రేవంత్ రెడ్డి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి సీఎం అయి రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీలు అమలుకు నోచుకోలేదని వికాస్ తల్లిదండ్రులు కవిత, లక్ష్మణ్ వాపోతున్నారు.

### గాంధారి మండలం లొంక తండా..

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లొంక తండాకు చెందిన వికాస్ రెండేళ్ల వయసులోనే చూపు కోల్పోయాడు. 15 ఏళ్ల వయసులోనే "అన్నా మా రైతు అన్న.." అనే పాటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్నాడు. ఒకే ఒక్కపాట ద్వారా కొన్ని కోట్ల మంది ఆదరాభిమానాలను చూరగొని అందరి మదిలో చెరగని ముద్ర వేసుకున్నాడు. వికాస్ చాలా పాటలు పాడినప్పటికీ రైతులపై పాడిన ఒక్కపాట రైతన్న పడుతున్న శ్రమను కళ్లకు కట్టినట్టు చేసింది. 'అన్నా మా రైతు అన్న' పేరుతో ఉన్న ఈ పాట కోట్లలో వ్యూస్ సాధించింది.

### వెన్నుతట్టిన సినీ నటుడు సోనూసూద్

సోనూసూద్ వికాస్ ప్రతిభను చూసి ప్రత్యేకంగా ఆల్బమ్ పాట పాడించడంతో అది అనేకమందికి గుండెలను హత్తుకుంది. సోను సూద్ కూడా నగదు రూపంలో సాయం చేశాడు. కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని కూడా వికాస్ తల్లిదండ్రులు కలవగా జగ్గారెడ్డి కూడా తనవంతు సాయంగా నగదు అందజేశారు. అయితే వికాస్ కంటి ఆపరేషన్‌కు డబ్బు ఎక్కువగా అవసరం ఉండడం.. సీఎం హామీ ఇవ్వడంతో ఆయన ఇచ్చిన హామీ అమలు కోసం అతడి తల్లిదండ్రులు కవిత లక్ష్మణ్ ఎదురు చూస్తున్నారు

### హామీ అమలు కోసం ఎదురుచూపులు..

సీఎం క్యాంప్ ఆఫీస్ చుట్టూ ఎన్నోసార్లు తిరిగామని వికాస్ తల్లిదండ్రులు కవిత లక్ష్మణ్ పేర్కొన్నారు. అప్పటి పీసీసీ చీఫ్.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కంటిచూపు కోసం సాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సీఎం స్పందించి వికాస్‌కు కంటి ఆపరేషన్లు చేయించి తమ కుమారుడి కళ్లల్లో వెలుగులు నింపాలని కోరుతున్నారు.

## పెళ్లి సంబురంలో కలకలం.. వేడుకకు వచ్చిన వ్యక్తిని కాటేసిన పాము..

**అక్షర టుడే, గాంధారి:** ఓవైపు పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరుగుతుండగా.. కాలకృత్యాల కోసం బయటకు వెళ్లిన ఓ వ్యక్తిని పాము కాటు వేసిన సంఘటన గాంధారి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికుల వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన నందు అనే వ్యక్తి ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు గాంధారికి వచ్చాడు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు అతడు బయటకు వెళ్లగా, ఒక్కసారిగా ఓ పాము అతడిని కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ప్రథమ చికిత్స (కట్టుమందు) కోసం సంగమేశ్వర ఆలయానికి తరలించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈఆర్‌సీపీ డాక్టర్ మనీష్ ఫోన్ ద్వారా సూచించిన ప్రథమ చికిత్సలను అందిస్తూ, అవసరమైన ఇంజెక్షన్లు ఇచ్చి బాధితుడిని హుటాహుటిన బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాన్సువాడ ఆసుపత్రిలో డాక్టర్ శీను నాయక్ బాధితుడికి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. నందు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని 108 సిబ్బంది తెలిపారు. పాము కాటుకు గురైన వ్యక్తిని క్షణాల వ్యవధిలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన 108 ఈఎంటీ రమేష్, పైలట్ నరేష్‌లను డాక్టర్ శీను నాయక్ ప్రత్యేకంగా అభినందించారు.

## బాధితుల కుటుంబాలకు పరామర్శ



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పలువురు బాధితులను ఆదివారం రాష్ట్ర కోఆపరేటివ్ యూనిట్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన పోడెండ్ల సంజీవ్ కుమారునికి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. దీంతో కుటుంబ సభ్యులని ఆయన పరామర్శించారు. అలాగే కువైట్ గంగాధర్ కుమార్తె శనివారం మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని సైతం మానాల పరామర్శించారు. గ్రామస్తుడు మండల శేఖర్ తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబానికి ధైర్యంచెప్పారు. కమ్మర్‌పల్లి మండల ప్రెసిడెంట్ భాస్కర్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణు, కమ్మర్‌పల్లి మాజీ అధ్యక్షుడు రవి, శ్రీనివాస్ రెడ్డి, భూమారెడ్డి, రాములు, అనిల్ పాల్గొన్నారు.




## 10న విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలి

**అక్షరటుడే: బోధన్:** స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 10న విద్యాంసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐపీఎస్‌యూ, పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు సుమారు రూ.10,500 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయ్నారు. దీంతో లక్షలాది మంది ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. నాయకులు విశాల్ దేవ్, అనిల్, విశాల్, మోసిన్, సాయినాథ్ తదితరులున్నారు.




# నిధుల మంజూరుపై హర్షం..

**కామారెడ్డి –మెదక్ జిల్లాలను అనుసంధానిస్తూ నిర్మించిన వంతెన త్వరలో వినియోగంలోకి రానుంది. గతంలో నిర్మించిన ఈ వంతెనకు రెండువైపులా అప్రోచ్ రోడ్లు లేక వృథాగా ఉంది. అయితే తాజాగా ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో రెండు జిల్లాలకు మధ్య రాకపోకలు సులువు కానున్నాయి. - అక్షరటుడే, ఎల్లారెడ్డి**

మంజీరా నదిపై హైలెవెల్ బ్రిడ్జి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ. 22.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. గతంలోనే ఇక్కడ వంతెన నిర్మించారు. అప్రోచ్ రోడ్లు లేక మెదక్- కామారెడ్డి జిల్లాలకు అనుసంధానం లేకుండా పోయింది. కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన కారణంగా పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ నిధులను సాధించుకోగలిగారు. ఈ వంతెన చుట్టూ ఉన్న పది గ్రామాలకు పైగా ఉన్న ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి స్పందించి నిధులు విడుదల చేశారు.

### 2017లో నిర్మాణం..

మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దులో మంజీరా నదిపై 2017లో సుమారు రూ.18కోట్లతో 320 మీటర్ల వంతెన నిర్మించారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రాంతీర్థం, కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామాలను కలిపేందుకు ఈ వంతెనను నిర్మించారు. అయితే వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ అనుసంధాన రోడ్డు పూర్తి కాకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి కట్టిన వంతెన వృథాగా మారింది. ఫలితంగా రెండు జిల్లాల అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఈ వంతెన నిరుపయోగంగా మిగిలిపోయింది.

### 15ఎకరాలకు పైగా భూమి అవసరం..

వంతెనకు ఓవైపు రాంతీర్థం వైపు నుంచి పాపన్నపేట వరకు సుమారు 2.9 కి.మీ లింక్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. దీనికోసం సుమారు 15 ఎకరాల భూమి సేకరించాలి. భూసేకరణ, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.22.5 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే మెదక్ జిల్లా పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల ప్రజలకు వ్యాపార లావాదేవీలు పెరగడంతో పాటు 40 కి.మీ దూరం తగ్గుతుంది. ఇప్పుడు ప్రజలు చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు.

### అధికారుల ఏమంటున్నారంటే..

టెండర్ పనులు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. అయితే మరోవైపున నాగిరెడ్డిపేట మండలంలో అప్రోచ్ రోడ్ సైతం అసంపూర్తిగానే మిగిలి ఉంది. దాని నిర్మాణానికి సైతం కామారెడ్డి జిల్లా అధికారులు రూ.13 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఆ నిధులు మంజూరై రెండు పక్కల అప్రోచ్ రోడ్డు పూర్తయినట్లవుతుంది. అప్పుడు రెండు జిల్లాల ప్రజలకు దూర భారం తగ్గనుంది. ఈ నిధులు సైతం త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. రెండు జిల్లాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే రెండు జిల్లాల మధ్య రాకపోకలు మరింత సులువు కానున్నాయి.



## ఆదివారం సైతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని పోచంపాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సైతం బీఎల్‌వోలు విధులు నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని దరఖాస్తు ఫారాలు సమర్పించారు. బీఎల్‌వోలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అవసరమైన వివరాలను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సెలవు రోజైనా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు కొనసాగిస్తున్న బీఎల్‌వోలను గ్రామస్తులు అభినందించారు. అర్హులైన ప్రతిఒక్కరూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకుని ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు పూర్తిచేసుకోవాలని బీఎల్‌వోలు సూచించారు.

## పెద్దమ్మ తల్లి దేవాలయంలో స్వచ్ఛభారత్

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణ శివారులోని పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్దమ్మ దేవాలయానికి ప్రతి ఆదివారం వందల మంది భక్తులు ఇక్కడ పూజలు నిర్వహిస్తారని, ఇక్కడికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను శుభ్రం చేశామన్నారు. దీనికి ఆలయ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందించారన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చేందర్, పెద్దులు, శ్రీను, ప్రసాద్, గోపి, భోజన్న, రవి, సుమన్, జలంధర్, విజయానంద్, ఉదయ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిశాంత్, ప్రశాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## నగరంలో అధ్వానమైన రోడ్లతో అవస్థలెన్నో..

**అక్షరటుడే, ఇందూరు:** నగరం దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు. చిన్నపాటి వర్షానికే శివారు కాలనీల్లో రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారడంతో ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని 8వ డివిజన్‌లో శనివారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ పూర్తిగా చిత్తడిగా మారాయి. పీఎఫ్ కార్యాలయం వెనక ప్రాతంలోని సీతారాం నగర్ కాలనీ, బంగారు మైసమ్మ రోడ్ నం.1 ప్రాంతాల్లో మట్టిరోడ్లు ఉండగా.. వర్షానికి బురదమయంగా మారాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి తయారైందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ రోడ్లపై నుంచి వెళ్తూ పలు వాహనాలు స్కిడ్ అయి వాహనదారులు కిందపడిపోయారని పేర్కొన్నారు. అయితే తాము కార్పొరేటర్‌ను సంప్రదించామని.. బంగారుమైసమ్మ రోడ్‌నం.1కు సీసీ రోడ్డు మంజూరైందని పేర్కొన్నారన్నారు. కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతోనే సమస్య పరిష్కారం కావట్లేదని వారన్నారు. రోడ్డు పనులు పూర్తి చేసి కాలనీవాసుల సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.

